విషజ్వరంతో బాలుడు మృతి

గజ్వేల్, ఆగస్టు 9: విషజ్వరంతో బాలుడు మృతిచెందిన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన శివలింగు స్వామి-కవిత కుమారుడు బన్నీ(9)ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. గురువారం నుంచి జ్వరం రావడంతో స్థానికంగా, సిద్దిపేటలో వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ శుక్రవారం బన్నీ మృతిచెందాడు. డెంగీతో మృతిచెందారని కుటుంబసభ్యులు చెబుతుండగా, డెంగీ నెగిటివ్ రిపోర్టు వచ్చిందని తొగుట వైద్యాధికారి రాధాకృష్ణ తెలిపారు.



సిద్దిపేటలోని ఆలయంలో పాలు పోస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగుపంచమి

● ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 9 : శ్రావణమాసంలో వచ్చే నాగుల చవితి పర్వదినం సందర్భంగా శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేటఅర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలో స్వయంభూ నాగదేవత ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. సిద్దిపేటలోని నాగదేవత ఆలయానికి జిల్లాతో పాటు హైదరాబాద్, సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి అలాగే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు హాజరై పూజలను నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆవు పాలు, జొన్న పేలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మార్కెట్లో జొన్న పేలాలు పది రూపాయలకు గ్లాసు చొప్పున విక్రయించారు. పండ్ల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి.



సిద్దిపేటలోని నాగదేవత ఆలయం వద్ద భక్తుల సందడి

బిల్లులు చెల్లించడం లేదని

డెయిరీ సూపర్‌వైజర్ల నిర్బంధం



పాలకేంద్రంలో సూపర్‌వైజర్లు

చిన్నకోడూరు, ఆగస్టు9: ప్రభుత్వం రెండు నెలలుగా బిల్లులు చెల్లించడంలేదని ఆగ్రహించిన చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన పాడి రైతులు గురువారం రాత్రి పాల కేంద్రం సందర్శనకు వచ్చిన విజయ డెయిరీ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సుమన్‌ను నిర్బంధించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడారు. గ్రామంలోని విజయ డెయిరీ పాల కేంద్రంలో 40 మంది రైతులు పాలు పోస్తున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు డెయిరీ అధికారులకు, సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. విషయం తెలుసుకున్న డెయిరీ మేనేజర్ రైతులతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ బిల్లులను ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పడంతో నిర్బంధించిన సూపర్‌వైజర్లను రైతులు విడిచిపెట్టారు.

మల్లన్న ఆలయంలో వేలంపాట

● నాలుగోసారి వాయిదాపడిన తలనీలాల సేకరణ

● ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి రూ.12.50 లక్షలు

చేర్యాల, ఆగస్టు 9 : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి రంగారావు సమక్షంలో టెండర్లు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు విక్రయానికి సంబంధించి రూ.12.50లక్షలకు హెచ్చుపాటపాడి ఎ.రవీందర్ టెండర్ దక్కించుకున్నారు. భక్తులు మొక్కుబడిగా సమర్పించిన తలనీలాల సేకరణకు వేలంపాటకు కాంట్రాక్టర్లు అనాసక్తి కనబరచడంతో నాలుగోసారి వాయిదా పడింది. తద్వారా హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కమిషనర్ ఇందుకు సంబంధించి వేలం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

కాంట్రాక్టర్ల కుమ్మక్కు..

మల్లన్న ఆలయంలో నిర్వహించిన తలనీలాల టెండర్‌లో ఓ కాంట్రాక్టర్ హెచ్చుపాటపాడేందుకు సన్నద్ధమైనప్పటికీ పలువురు బెదిరించడంతో వెనక్కి తగ్గాడని బీజేపీ మండలాధ్యక్షుడు బూరుగోజు నాగరాజు తెలిపారు. నాలుగుసార్లు వాయిదా పడటం వెనుక కాంట్రాక్టర్ల కుమ్మక్కు దాగి ఉందన్నారు. ఈవిషయమై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సీల్డ్ టెండర్లు నిర్వహించాలని కోరారు.

ఆకుపచ్చ సిద్దిపేట



సిద్దిపేటలోని కోమటిచెరువు వద్ద..

● పట్టణానికి హరితసోయగం

● రంగనాయక సాగర్ వద్ద ప్రకృతి వనం, బృహత్, నర్సరీలు ఏర్పాటు

● 12 ఎకరాల్లో నిరంతరాయంగా మొక్కల పర్యవేక్షణ

● డివైడర్‌లపై అందమైన మొక్కలు

● సిద్దిపేటలో 18 లక్షల మొక్కల పెంపకం

● జీపీఎస్ ట్రాకింగ్‌తో 15 ట్యాంకుల ద్వారా మొక్కలకు నీరు

సిద్దిపేటటౌన్, ఆగస్టు 9: స్వచ్ఛమైన గాలి, ప్రశాంత వాతావరణం కోసం ఉదయం లేవగానే ఆరుబయటకు వెళ్లి మంచిగాలిని పీల్చుకుంటే ఆ ఆనందమే వేరు. రోజంతా హుషారుగా ఉండటంతో పాటు మనసుకే కాదు.. శరీరానికి కూడా మంచిదేనని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతుంటారు. అయితే పెరిగిన కాలుష్యం వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. ముందుచూపుతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవ, సూచన మేరకు, మున్సిపల్ కౌన్సిల్, అధికారులు, సిబ్బంది హరితహారంలో భాగంగా నలుదిక్కులా అందమైన మొక్కలు నాటారు. ఆ మొక్కలు ఏపుగా పెరగడంతో సిద్దిపేటలో ఎక్కడా చూసిన పచ్చదనం వెల్లివిరుస్తున్నది.

పర్యావరణాన్ని కాపాడుతున్న ప్రభుత్వాలు

పర్యావరణాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం హరితహారం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీలో పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మూడేళ్లుగా సిద్దిపేట పట్టణ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ వద్ద దాదాపు 12 ఎకరాల్లో కృత్రిమ అడవులను తలపించేలా మున్సిపల్ అధికారులు వేలాదిగా మొక్కలను పెంచుతున్నారు. ప్రత్యేకంగా 20 మందికి పైగా సిబ్బందిని నియమించి వనంలో మొక్కలకు నీరు పట్టడంతో పాటు, మొక్కలుఎండిపోకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇదే ప్రాంతంలో పట్టణ ప్రకృతి వనం, బృహత్ పట్టణ ప్రకృతి వనం (తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచే క్రమం), ఫ్రీడమ్ పార్కును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రంగనాయక సాగర్ వద్ద దాదాపు 12 ఎకరాలలో పట్టణంలోని 43 వార్డులకు గాను 43 పట్టణ ప్రకృతి వనాలు, పట్టణాల్లో మొక్కలు నాటేందుకు, ప్రతి ఇంటింటికీ ఉచితంగా మొక్కలను అందించేందుకు నర్సరీలో, ఆహ్లాదకరమైన వాతవరణంలో చిన్నారులు ఆడుకునేందుకు, వ్యాయామం చేసుకునేందుకు వాకింగ్ ట్రాక్‌ల కోసం ఫ్రీడం పార్కును ఏర్పాటు చేశారు. దీంతో పాటుగా పచ్చదనం పెంపొందించేందుకు రంగనాయకసాగర్‌తో పాటు పట్టణంలోని జడ్జి క్వార్టర్స్, కేసీఆర్‌నగర్ లోని డబుల్ బెడ్‌రూం, ప్రభుత్వ మహిళా కళాశాలలో కూడా మొక్కలను పెంచుతూ సంరక్షిస్తున్నారు.



పట్టణంలో రహదారులకు ఇరువైపులా, డివైడర్‌పై పెరిగిన చెట్లు



నర్సరీల్లో మొక్కలను సంరక్షిస్తున్న సిబ్బంది

ప్రకృతివనం, బృహత్, నర్సరీలో

పట్టణ ప్రకృతి, బృహత్ ప్రకృతి వనం, నర్సరీలలో వేలాది సంఖ్యలో మొక్కలను సిబ్బంది సంరక్షిస్తున్నారు. వీటిలో 43 వార్డులకు సంబంధించి పట్టణ ప్రకృతివనాలలో 86 వేల మొక్కలు, బృహత్ పట్టణ ప్రకృతి వనంలో 12 వేల మొక్కలు, ఫ్రీడం పార్కులో 9,850 మొక్కలున్నాయి. వేప, నిమ్మ, చింత, కదంబా, దానిమ్మ, ఉసిరి, నురువరాలు, నందివర్దని, స్పతోడియా, లగిస్ట్రోమియా, పొగడ, సీతాఫలం, జామా, బాదం, బహునియా, శుక్రేశియా, బోగాన్విల్లియా, అకాలిఫా, ఆకాశమల్లె, బిగ్నోనియా, టికోమా (ఆరెంజ్), సిసల్పినియా, నికోడియా, రెడ్ నైట్ క్యిన్, పలు రకాల పూలు, పండ్లు తదితర మొక్కలున్నాయి.



సిద్ది పేట పట్టణంలో పచ్చని చెట్ల తోరణం



మున్సిపల్ బడ్జెట్‌లో 10 శాతం నిధులు..

సిద్దిపేటలో నాటిన మొక్కలతో పాటు, రంగనాయకసాగర్ తదితర ప్రాంతాల్లో నాటిన మొక్కలను పర్యవేక్షించేందుకు మున్సిపల్ బడ్జెట్‌లో ఏడాదికి పది శాతం చొప్పున పచ్చదనం కోసం నిధులను ఖర్చు చేస్తుంది. పట్టణ ప్రకృతి వనం కోసం 2020 నుంచి రూ. 6 కోట్లకు పైగా ఖర్చు చేశారు. వీటిలో 2020-21కి గానూ రూ. 70 లక్షలు, 2021-22కి గానూ రూ. 2 కోట్లు, 2022-23కి గానూ 3.13 కోట్లకు పైగా బడ్జెట్‌ను కేటాయించింది. వీటిలో పలు మొక్కల కొనుగోలు, సిబ్బంది నెలసరి వేతనాలు, ఎర్రమట్టి వినియోగం, హరితహారంలో భాగంగా నాటిన చెట్లకు ట్రాక్టర్లకు జీపీఎస్‌ను అనుసంధానం చేసి 15 ట్యాంకుల ద్వారా నీరందించేందుకు తదితర వాటి కోసం వినియోగిస్తున్నారు. పట్టణంలో పలు బోర్ల ద్వారా డివైడర్‌పై నాటిన అందమైన మొక్కలకు డ్రిప్ సిస్టమ్ ద్వారా నీరును అందిస్తున్నారు. కొన్నేళ్లుగా హరితహారంలో భాగంగా పట్టణంలో నలుదిక్కులా డివైడర్లపై, రహదారికి ఇరువైపుల, పలు కాలనీల్లో, ఖాళీస్థలాలో 18లక్షలకు పైగా మొక్కలు నాటడంతో స్వాగత తోరణాలుగా పచ్చదనం వెల్లివిరుస్తోంది.

ఆకుపచ్చ పట్టణంగా మార్చాలనే..

సిద్దిపేటను ఆకుపచ్చ పట్టణంగా మార్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన, సహాయ, సహకారంతో ముందుకెళ్లాం. అందుకుగానూ పట్టణ ప్రకృతివనాన్ని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేశాం. మొక్కలను నిరంతరంగా పర్యవేక్షించి, సంరక్షించేందుకు హరిత సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నాం. పర్యాటకరంగంగా మారిన రంగనాయక సాగర్ వద్ద మరింత ఆహ్లాదం పెంచడంతో పాటు ప్రకృతి వనంలో కూడా సిద్దిపేట ముందుండేలా, సిబ్బంది, పట్టణ ప్రజల భాగస్వామ్యంతో కృషిచేస్తాం.

- కడవేర్గు మంజుల రాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్ సిద్ది పేట

త్వరలోనే గౌరవెల్లి నుంచి నీటి విడుదల

● నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



అక్కన్నపేట మండలం పోతారం(జే)లో ఈత మొక్కను నాటి నీరు పోస్తున్న మంత్రి

అక్కన్నపేట/హుస్నాబాద్/కోహెడ, ఆగస్టు 9: త్వరలోనే కాలువలు నిర్మించి గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం అక్కన్నపేట మండలం పోతారం(జే)లో 75వ వన మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించిన తర్వాతనే ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేస్తామని చెప్పారు. గుంట కూడా బీడు భూమి లేకుండా రైతులు పంటలు సాగు చేయాలని కోరారు. రైతులు పండ్ల తోటలు సాగు చేసేందుకు ముందుకు రావాలని, ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం ఉంటుందని పేర్కొన్నారు. అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకే స్కిల్ డెవలప్ మెంట్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ భూమి ఎక్కడ ఉన్నా వన మహోత్సవంలో భాగంగా గీత కార్మికులు తమ ఉపాధి కోసం తాటి, ఈత మొక్కలను నాటుకోవాలని సూచించారు. అంతకుముందు ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తామని, గౌడ సంఘం భూమి సమస్య పరిష్కరిస్తానని గౌడ సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, ఆర్డీవో రామ్మూర్తి, ఎక్సైజ్ సీఐ పవన్, డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో జయరాం, తహసీల్దార్ అనంతరెడ్డి, ఏపీవో ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు రంగు యాదగిరి గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తుంచుకోవాలి

క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఉద్యమ స్ఫూర్తితో రాబోయే కాలంలో ప్రతి భారతీయుడు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, నాయకులు తదితరులున్నారు. నాగుల పంచమిని పురస్కరించుకుని మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలోని నాగులమ్మ ఆలయంలో పూజలు చేశారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టిసారించాలి

రైతులు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై దృష్టి పెట్టి వార్షిక ఆదాయం పెంచుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కోహెడ, బస్వాపూర్ రైతువేదిక ప్రాంగణంలో జరిగిన వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రెండు విడతలుగా రుణమాఫీ చేసిందని, ఇంకా రుణమాఫీ కానివారు ఉంటే వ్యవసాయ అధికారులను కలవాలని సూచించారు. గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్లు ఫ్రీ కరెంటు రాకున్నా ప్రజాపాలన సేవాకేంద్రాల వద్ద ఆధార్ అనుసంధానం చేయించుకోవాలన్నారు. అనంతరం కోహెడ పంచాయతీలో స్టీల్ బ్యాంక్‌ను మంత్రి ప్రారంభించారు. క్విట్ ఇండియా..క్విట్ ప్లాస్టిక్ నినాదంతో ముందుకుసాగుదాం అని పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఆధ్వర్యంలో 80 గ్రామాల్లో స్టీల్ బ్యాంక్ పెట్టాలని భావిస్తున్నామని ఆయన వివరించారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేట్ కట్ చేశారు. రైతు వేదిక ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా, జిల్లా వ్యవసాయ అధికారి ప్రభాకర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, పశు వైద్యధికారి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి : కలెక్టర్

వర్గల్, ఆగస్టు 9 : ప్రతీ వ్యక్తికి వ్యక్తిగత శుభ్రత ఎంత అవసరమో పరిసరాల పరిశుభ్రత అంతే అవసరమని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం అవుసులోనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో వనమహోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో కళాశాల ప్రహరీ చుట్టూ మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులతో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని గ్రామాల్లో పండుగలా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. అప్పుడే గ్రామలు పచ్చదనంతో కళకళలాడుతాయన్నారు. విద్యార్థులు తమ పుట్టిన రోజు నాడు, అలాగే ఏదైన ప్రత్యేక రోజు నాడు తప్పకుండా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. ముందుగా కళాశాలకు వచ్చిన కలెక్టర్‌కు కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లను పరిశీలించారు. కళాశాలలోని సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ బాల్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, మం డల ప్రత్యేకాధికారి అనిత, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

నారాయణఖేడ్, ఆగస్టు 9 : కంగ్టి మండలం వాసర్ బిబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ బల్‌రాం, నాగల్‌గిద్ద మండలం ఇరక్పల్లికి చెందిన జాదవ్ మారుతి 2015 మార్చిలో 180 కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి జిల్లా అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

పింఛన్ డబ్బు కోసం తల్లిని చంపిన తనయుడు

- మద్యం తాగేందుకు ఇవ్వలేదని ఉరేసిన కొడుకు


దుర్గవ్వ(ఫైల్)

నిజాంపేట, ఆగస్టు 9 : మద్యానికి బానిసైన ఓ కుమారుడు తాగేందుకు మద్యం డబ్బు ఇవ్వలేదని ఏకంగా కన్నతల్లినే చంపేశాడు. మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు సీఐ వెంకటరాజగౌడ్, ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చల్మేటి దుర్గవ్వ(76)కు దివ్యాంగ పింఛన్ వస్తుంది. ఆమె కుమారుడు రామచంద్రం బీడీ కంపెనీలో పని చేస్తాడు. భార్య కూలీ పని చేస్తుంది. వారి కుమారుడు కూడా ఆర్థికంగా ఆదుకుంటుంటాడు. అతను పని చేస్తే వచ్చే డబ్బు తాగుడుకు సరిపోక గురువారం రాత్రి మద్యం తాగేందుకు తల్లిని పింఛన్ డబ్బు అడిగాడు. ఆమె నిరాకరించడంతో ఆవేశానికి గురై అర్ధరాత్రి తర్వాత ఇంట్లోనే చున్నీతో ఉరేశాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి చూడగా, కన్న కొడుకే హత్య చేసినట్లు తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబర్‌పేటలో దొంగల హల్‌చల్

- తాళం వేసిన 10 ఇళ్లలో చోరీ


ఓ ఇంట్లో దొంగలు తెరిచిన బీరువా

వర్గల్, ఆగస్టు 9 : మండలంలోని అంబర్‌పేటలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. తాళం వేసిన పది ఇళ్లల్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ చేశారు. గౌరారం ఎస్‌ఐ కరుణకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట గ్రామానికి చెందిన మన్నే స్వామి ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి వస్తువులు, రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. మన్నే రమేశ్ ఇంట్లో నుంచి 50 తులాల వెండి వస్తువులు, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే కోడపర్తి ప్రకాశ్, ఇంద్రసేనరెడ్డి, కుమార్ ఇళ్లల్లో చొరబడి తులం బంగారం, 30 తులాల వెండి వస్తువులు, రూ.10 వేల నగదు చోరీ చేశారు. మరో ఐదు ఇళ్ల తాళాలను ధ్వంసం చేసి బీరువాలలో ఉన్న దుస్తులను చిందరవందర చేశారు. మొత్తం పది ఇళ్లల్లో మూడు తులాల బంగారు ఆభరణాలు, 120 తులాల వెండి, రూ.70 వేల నగదును అపహరించారని ఎస్‌ఐ వివరించారు. గ్రామంలోని సీసీ ఫుటేజ్ సేకరించి దొంగలను పట్టుకుంటామని తెలిపారు. సంఘటన స్థలాలను గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పరిశీలించారు.

పార్ట్‌టైం జాబ్ పేరిట రూ.6.50 లక్షలు టోకరా

తూప్రాన్, ఆగస్టు 9: ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరిట పెట్టుబడులు పెట్టించుకుని సైబర్ నేరగాళ్లు రూ.6.50 లక్షలు కాజేసిన సంఘటన తూప్రాన్ మండలంలో చోటు చేసుకున్నది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. మండలానికి చెందిన వ్యక్తి మొబైల్‌లో టెలిగ్రామ్ అకౌంట్‌లో మైఖెల్ కోర్స్ 2185 గ్రూపులో జాయిన్ అయ్యాడు. ఆన్‌లైన్ పార్టుటైం జాబ్ కింద ప్రొడక్టు బిజినెస్ అంటూ ఒక లింక్ పంపించారు. ఆ లింక్ ఓపెన్ చేసి అడిగిన సమాచారం పొందుపర్చాడు. గతనెలలో రూ.10వేలు, రూ.21,423 పెట్టుబడి పెట్టగా లాభం చూపించారు. నమ్మకం కలగడంతో పలు దఫాలుగా రూ.6.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. ఈనెల 6న ఆన్‌లైన్ గ్రూపు అకౌంట్‌లో రూ.10 లక్షలు లాభం చూపించాడు. వాటిని విత్‌డ్రా చేసుకోడానికి ప్రయత్నించగా రాలేదు. టెలిగ్రామ్ గ్రూపును సంప్రదించగా రూ.5 లక్షలు పంపిస్తే డబ్బు డ్రా చేసుకోడానికి వీలవుతుందని వివరించారు. దాంతో రూ.6.50 లక్షలు మోసం పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై సీసీ కెమెరాలు మాయం


రాడ్‌పై కనిపించని సీసీ కెమెరా

అక్కన్నపేట, ఆగస్టు 8 : ఎన్జీటీని ఆదేశాల మేరకు గుడాటిపల్లి వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై జీఆర్‌ఎంబీ అధికారులు 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందులో నుంచి 4 సీసీ కెమెరాలు మాయం అయ్యాయి. గౌరవెల్లి నుంచి బంజారాహిల్స్ తండా సైడ్ ఉన్న సీసీ కెమెరాలు కనిపించడం లేదు. ఎవరైనా ఎత్తుకెళ్లారా..? లేదా కావాలనే తీశారా..? అనే అనుమానాలను ప్రాజెక్టు భూ నిర్వాసితులు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, ఇరిగేషన్ శాఖల అధికారులు పరిశీలించాల్సిందిగా వారు కోరుతున్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు!

- ఉదయం 11గంటలకే పాఠశాలకు తాళం
- విద్యార్థులు లేక తాళం వేశానన్న హెచ్.ఎం.
- విచారణ చేయిస్తామన్న డీఈవో

కంది, ఆగస్టు 9 : మండలంలోని బ్యాతోల్ గ్రామ ప్రాథమిక పాఠశాలకు శుక్రవారం ఉదయం 11 గంటలకే తాళం పడింది. విద్యార్థులు రాలేదన్న కారణంతో ప్రధానోపాధ్యాయుడు కూడా వెంటనే పాఠశాలకు తాళం వేసి బయటకు వెళ్లిపోయారు. బ్యాతోల్ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతుల్లో మొత్తం 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పాఠ్యాంశాలు బోధించడానికి ఒక హెచ్‌ఎంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఇటీవల ఒకరిని కందికి బదిలీ చేసినట్లు తెలిసింది. మిగిలిన ఒకరు సెలవు పెట్టడంతో పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం కూడా అలా వచ్చి ఇలా వెళ్లారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న బడికే ఇలా తాళం వేస్తే, మారుమాల గ్రామాల్లోని పాఠశాలల్లో బోధన ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయమై పాఠశాల హెచ్‌ఎం తుల్జారాంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా శుక్రవారం విద్యార్థులు ఎవరూ రాలేదని, తనకు రావలసిన గత నెల వేతనాన్ని తెచ్చుకోవడానికి ట్రెజరీకి వెళ్లానని, అందుకే పాఠశాలకు తాళం వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని డీఈవో వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా బ్యాతోల్ పాఠశాల హెచ్‌ఎం తనకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, విద్యార్థులు లేకున్నా పాఠశాల తెరిచే ఉంచాలని చెప్పారు. ఈ విషయమై తాను విచారణ చేయిస్తానని పేర్కొన్నారు.



బ్యాతోల్‌లో తాళం వేసి ఉన్న ప్రాథమిక పాఠశాల

తండ్రి హత్యలో కొడుకే సూత్రధారి

- సహకరించిన మరో ముగ్గురు అరెస్ట్

కోహెడ, ఆగస్టు 9 : మండలంలో వరుకోలు గ్రామంలో ఈనెల 7న హత్యకు గురైన ఎండీ ఫకీర్‌నబీ(45) హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. కోహెడ పోలీస్‌స్టేషన్‌లో రెండు రోజుల్లోనే హత్య కేసును ఛేదించామని, వివరాలను వెల్లడించారు. పోలీసులు మొదటగా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసినట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. విచారణలో ఫకీర్‌నబీ కొడుకు జావిద్ ప్రధాన సూత్రధారుడు అని తేలింది. ఫకీర్‌నబీ పదేళ్ల నుంచి మద్యానికి బానిసై తన భార్యను కొడుతూ నానా బూతులు తిడుతూ వేధింపులకు గురిచేసేవాడు. నెల రోజుల క్రితం వారు ఉంటున్న హైదరాబాద్‌లోని బాలాజీనగర్ నుంచి తన భార్యను కొట్టుకుంటూ వరుకోలు గ్రామానికి తీసుకువచ్చారు. ఫకీర్‌నబీ తన భార్యను చంపడానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకొని కూరెళ్ల గ్రామంలోని తల్లిగారింటిలో తలదాచుకున్నది. అప్పటి నుంచి ఫకీర్‌నబీ తన భార్యను చంపాలని ఉద్దేశంతో ఆమె కోసం వెతుకుతున్నాడు. అదే క్రమంలో ఈనెల ఆరో తేదీన అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఫకీర్‌నబీ తన కొడుకు జావేద్, బంధువుల ఇంటికి వెళ్లి భార్య గురించి వెతుకుతూ గొడవపడ్డాడు. జావిద్‌తో పాటు బామ్మర్ది హజీబాబా, బంధువైన ముస్తఫా అక్కడికి చేరుకుని ఎందుకు గొడవ పడుతున్నావు అని అడగగా ఫకీర్‌నబీ తన కొడుకు జావేద్‌ను నానా బూతులు తిట్టి, కొట్టడానికి ప్రయత్నించాడు. కోపానికి గురైన జావేద్ తన తండ్రి నబీని కొట్టగా కిందపడి స్పృహ కోల్పోయాడు. పూల వ్యాపారం చేసుకునే అంకుష్ స్పృహ కోల్పోయిన నబీని ఆటోలో వరుకోలు గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామ శివారులోని ఈద్గా దగ్గరికి తీసుకువచ్చి ఆటోలో నుంచి దించి ముగ్గురు కలిసి బండరాలతో కొట్టడంతో మృతుడు అక్కడికక్కడే చనిపోయాడు. హత్యానంతరం ఇదే మండలంలోని కూరెళ్ల గ్రామానికి వెళ్లి తలదాచుకున్నారు. శుక్రవారం వారిని అరెస్ట్ చేశారు. విచారణలో తన తండ్రిని చంపినట్లు ఒప్పుకోవడంతో జావిద్‌తో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచామని సీఐ పేర్కొన్నారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్‌ఐ సీహెచ్ తిరుపతి, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.


నలుగురు నిందితులను చూపుతున్న సీఐ శ్రీనివాస్

పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో 11 బోధకాల పాజిటివ్ కేసులు

పటాన్‌చెరు, ఆగస్టు 9 : పటాన్‌చెరు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో రక్తపరీక్షలు నిర్వహించగా 11 బోధకాల కేసులు పాజిటివ్ నమోదు అయ్యాయని పటాన్‌చెరు ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అనీసాసన్రీన్ శుక్రవారం తెలిపారు. బోధకాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పదిహేను రోజుల పాటు మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండు సంవత్సరాలపైబడిన వారికి ముందు జాగ్రత్తగా ఐవర్‌మెక్టిన్ మందులు వేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఆశావర్కర్లు, హెల్త్‌సెంటర్లలో మందులు అందుబాటులో ఉంటాయన్నారు. బోధకాల వ్యాధికి కారణమైన ఎలిఫెంటాసిస్‌ను తరిమి కొట్టాలన్నారు. అయితే, రక్తపరీక్షలు నిర్వహించగా 11 మందికి బోధకాల పాజిటివ్ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నివారణ తప్ప నయం కాని వ్యాధిని మందుల ద్వారా నిరోధించాలన్నారు. పరిసరాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారి సుధాకర్


గంబూషియా దోమచేపలను వదులుతున్న అధికారి

కోహీర్ ఆగస్టు 9 : గంబూషియా(దోమ చేప)లతో దోమల లార్వాను నివారించడం సాధ్యపడుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కవేలి, ఖానాపూర్, కోహీర్ గ్రామాల్లో మురుగునీరు ఎక్కువగా నిలిచి ఉన్న చోట గంబూషియా చేపలను వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో దోమ చేపలను వదలడం వల్ల దోమల నియంత్రణ కావడమే కాకుండా ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి దూరమవుతాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో 18న ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్

పాఠశాల విద్యార్థుల సాంకేతిక పాజెక్టుల ప్రదర్శన

కంది, ఆగస్టు 9: పాఠశాల విద్యార్థులను ఆవిష్కరణల వైపు ప్రోత్సాహించడమే లక్ష్యంగా 'ఫ్యూచర్ ఇన్వెంటర్స్ ఫెయిర్' పేరిట ఐఐటీ-హైదరాబాద్ గత సంవత్సరం నుంచి ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ నెల 18న రెండో ఎడిషన్ ప్రారంభం కానున్నదని ఐఐటీహెచ్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సాంకేతిక పురోగతి, సృజనాత్మకత వనరుల వంటి విభిన్న ప్రాజెక్టులను, సరికొత్త ఆలోచనలతో కూడిన ఆవిష్కరణలను ఐఐటీహెచ్‌లో ప్రదర్శించనున్నారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 22 పాఠశాలలు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఇంటర్న్‌షిప్‌ల ద్వారా పాఠశాలస్థాయి విద్యార్థులు వారి అభ్యాసం మరింత పెంచుకోవడానికి ఐఐటీ-హెచ్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, నిపుణులతో సన్నిహితంగా పనిచేయడానికి ఈ ఫ్యూచర్ ఇన్వెంటర్స్ అపూర్వ అవకాశం. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.29 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు.

సెట్విన్ వ్యవస్థను బలోపేతానికి కృషి

- మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సెట్విన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గిరిధర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎన్. గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్, ఆగస్టు 9: సెట్విన్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్, ట్రైనింగ్ ట్విన్ సిటీస్) కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్.గిరిధర్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి చెన్నారెడ్డి నేతృత్వంలో 1978లో హైదరాబాద్‌లో సెట్విన్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సెట్విన్ సేవలను కేవలం జంట నగరాలకే కాకుండ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 24 కేంద్రాల్లో ఏటా 25 వేల పైచిలుకు యువతకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎన్.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ సెట్విన్ వ్యవస్థను బలోపేతం చేసేదిశగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సెట్విన్ ఎండీ వేణుగోపాలరావు, సీనియర్ నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా శుక్రవారం గ్రామాలు, పట్టణాలు, పాఠశాలల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట రూరల్: విద్యార్థులతో కలిసి మొక్కలకు నీరు పోస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్


సిద్దిపేట టౌన్: పట్టణంలో మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రేరణ


సిద్దిపేట క్రైం: మొక్కను నాటి నీళ్లు పోస్తున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి


దుబ్బాక: మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి


గజ్వేల్: పట్టణంలో మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి


హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత


సిద్దిపేట టౌన్: మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య


గజ్వేల్‌లో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 9: వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశాడు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాణే బ్రేక్ లైనింగ్స్ లిమిటెడ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదల్లో కొట్టుకుపోయిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వయనాడ్ కుటుంబాలను ఆదుకునేందుకు అనేక రూపాల్లో చర్యలు తీసుకుంటుందని, కానీ కేంద్రం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆయన వెంట రాణే బ్రేక్ యూనియన్ కార్యదర్శి వేణుగోపాల్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, రంగారెడ్డి, మల్లయ్య, రాజగోపాల్, వెంకట్రావు ఉన్నారు.

- **దుబ్బాక:** వయనాడ్ వరద బాధితులకోసం దుబ్బాక మండలం సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సింగిరెడ్డి నవీన ఆధ్వర్యంలో దుబ్బాకలో విరాళాలు సేకరించారు.


దుబ్బాక: విరాళాలు సేకరిస్తున్న నాయకులు

కార్పొరేట్ అనుకూల విధానాలను వెనక్కి తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్

నారాయణరావుపేట, ఆగస్టు 9: కేంద్రం కార్పొరేట్ అనుకూల విధానాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తూనికి మహేష్ డిమాండ్ చేశారు. క్విట్ ఇండియా పోరాట స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలను క్విట్ చేస్తూ దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకమైనదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ దేశాన్ని మోసం చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణ ప్రాంతంలోని సింగరేణి బొగ్గు బ్లాకులను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలను వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనంగా 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇప్పటికైనా ఆలోచన చేసి బడ్జెట్‌లో మార్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

కొర్రీలు లేకుండా రుణమాఫీని అమలు చేయాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 9: కొర్రీలు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'అన్నదాతల ఆవేదనపై రైతు రచ్చబండ' అనే కార్యక్రమాన్ని గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో శుక్రవారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించి సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ మాట ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సవాలక్ష కొర్రీలతో రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ పేరిట అనేక వాగ్దానాలు చేసి రైతులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చిందన్నారు. రచ్చబండ కార్యక్రమానికి రైతులు భారీగా వచ్చి తమ గోడును వెల్లబోసుకున్నారని, ప్రభుత్వం ఆంక్షలు ఎత్తివేసి రైతుబంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ధరం గురువారెడ్డి, వెంకటరమణ, కిసాన్‌మోర్చా నాయకులు వెంకట్‌రాంరెడ్డి, మర్కంటి ఏగొండ, జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, యెల్లు రాంరెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్లు ఎల్కంటి సురేశ్, బండారి మహేశ్, కోదండం శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, రాములు, నాయిని సందీప్, బారు అరవింద్, కుంకుమరాణి, ఉమ ఉన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీ

సిద్దిపేట క్రైం, ఆగస్టు 9: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా కమిషనరేట్ పరిధిలోని 16 మంది ఏఎస్‌ఐలు, 42 మంది హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు బెల్టుల పంపిణీ

దూళిమిట్ట, ఆగస్టు 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత,ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 250 మందికి శుక్రవారం దూళిమిట్ట డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో టై, బెల్ట్, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, దూళిమిట్ట డెవలప్‌మెంట్ ఫోరమ్ సభ్యులు పబ్బోజు సత్యం, కొంగర రాజు, భావండ్లపల్లి కృష్ణ, భావండ్లపల్లి రాజు, దుబ్బుడు మహేందర్, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్'

దౌల్తాబాద్, ఆగస్టు 9: సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేదలకు అండగా నిలుస్తున్నదని బీజేపీ మండలాధ్యక్షుడు సర్వుగారి భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు బీజేపీ మండల నాయకులు శుక్రవారం బాధితులకు అందజేశారు.మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన పడాల రుకమ్మకు రూ.42 వేలు, అప్పాయిపల్లికి చెందిన మల్లయ్యకు రూ.33 వేల 500, ఇందుప్రియాల్‌కు చెందిన శాంతమ్మకు రూ.18 వేలు, మల్లవ్వకు రూ.10 వేల 500 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విప్ బీర్ల అయిలయ్యను కలిసిన యాదవకుల సంఘం సభ్యులు

చేర్యాల, ఆగస్టు 9: కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామ యాదవ కులపెద్దలు శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను గొంగడితో సత్కరించారు. గ్రామంలో నిర్మించిన శ్రీచైతన్య యాదవ కమిటీహాల్ ప్రారంభోత్సవానికి ఈనెల 16వతేదీన హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గంగుల మల్లయ్య దాసరి వెంకటయ్య, గంగుల ఐలయ్య గువ్వల రాజయ్య, తిప్పారం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

'తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'


మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్

మద్దూరు, ఆగస్టు 9: తపాలాశాఖ సేవలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ పోస్టల్ పేమెంట్ జనగామ బ్యాంకు మేనేజర్ బానోతు రమేష్ సూచించారు. మండలంలోని మర్మాములలో పోస్టాఫీసు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న తపాలశాఖ ద్వారా ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్‌పోలు మల్లారెడ్డి, బిక్షపతి, బ్రాంచ్ పోస్టు మాస్టర్లు ఆనంద్, సుధాకర్, యశ్వంత్, సుధాకర్, వరుణ్, సుకన్య, ప్రతిభ, బాబు, రాణి తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన బియ్యంపై పౌరసరఫరా అధికారుల విచారణ

చేర్యాల, ఆగస్టు 9: చేర్యాల మండలం ముస్త్యాల గ్రామశివారులో గురువారం లారీలోడు బియ్యం పట్టుబడిన విషయమై సివిల్ సప్లయిస్ అధికారులు విచారణ చేపట్టారు. ఈమేరకు సివిల్‌సప్లయిస్ డీటీ లావణ్య తదితరులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలోని లారీని పరిశీలించారు. బియ్యం బస్తాల్లో నుంచి శాంపిల్స్ తీసుకువెళ్లారు. పరిశీలనానంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పెంపుడు జంతువుల నుంచి వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పశువైద్యాధికారి శ్వేత


టీకాలు వేస్తున్న శ్వేత

జగదేవ్‌పూర్, ఆగస్టు 9: పెంపుడు జంతువుల నుంచి మానవులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్వేత సూచించారు. జగదేవ్‌పూర్ ప్రాథమిక పశువైద్య కేంద్రంలో శుక్రవారం పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్లల్లో పెంచుకునే కుక్కలు, పిల్లులకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, వీఏఎస్ హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

కల్లుగీత కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

మద్దూరు, ఆగస్టు 9: మద్దూరు మండల కల్లు గీత కార్మిక సంఘం నూతన కమిటీని జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా బొమ్మ శివయ్య, బండి బాలయ్య, కూరెల్ల బాలయ్య, పోతుగంటి లింగం, ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి జనార్దన్, గుండెగోని మల్లేశం, వగలబోయిన రాజు, ప్రధాన కార్యదర్శిగా బండి నర్సింహులు, కోశాధికారిగా కూరెల్ల శంకరయ్య, సహాయకార్యదర్శులుగా బూరుగు రాజు, నాగిళ్ల పరమేష్, తాళ్లపల్లి శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా బిక్షపతి, బాబు, మల్లయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, రవి, రామస్వామి, సోషల్ మీడియా కన్వీనర్‌గా గణేష్, కో కన్వీనర్‌గా రాకేష్, వీరేందర్, పరమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


గోదావరి జలాలకు పూజలు


గోదావరి జలాల్లోకి పూలు చల్లుతున్న రైతులు

మర్కుక్, ఆగస్టు 9: కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయకపోతే 50వేల మంది రైతులు ధర్నాలు చేసి రహదారులను దిగ్బంధం చేస్తామని హెచ్చరించడంతో కాంగ్రెస్ తలొగ్గి మల్లన్నసాగర్‌లోకి, కొండపోచమ్మసాగర్‌లోకి శుక్రవారం నీటిని విడుదల చేసిందని అన్నారు. ప్రతాప్‌రెడ్డి నియోజకవర్గ రైతులతో కలిసి కొండపోచమ్మసాగర్‌లో పూలు చల్లి గోదావరి జలాలను ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు కనకయ్య, రవీందర్, నాయకులు అహ్మద్, స్వామిచారి, నరేష్, బీరయ్య, శ్రీనివాస్, వెంకటేశం, నియోజకవర్గ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన బీఆర్‌ఎస్

- డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు


మాట్లాడుతున్న నాగరాజు

చిన్నకోడూరు, ఆగస్టు 9: రంగనాయకసాగర్ ప్రాజెక్టు ద్వారా పంటలకు సాగు నీరు అందించేందుకు పూర్తిస్థాయిలో కాలువల నిర్మాణం చేపట్టకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ ఆరోపించారు. చిన్నకోడూరులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రాజెక్టులలోకి నీటిని పంపింగ్ చేస్తారనే విషయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ముందే తెలుసుకుని, ప్రాజెక్టులలోకి నీటిని పంపింగ్ చేయాలని సంబంధిత మంత్రికి లేఖ రాయడం హాస్యాస్పదమన్నారు.

ప్రజల రక్షణ, భద్రత కోసం కృషి

- తొగుట సీఐ లతీఫ్

కొండపాక, ఆగస్టు 9: ప్రజలకు రక్షణ, భద్రత ఇతర అవసరమైన సేవలను అందించడంలో అండగా ఉంటామని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. మండలంలోని దమ్మక్కపల్లిలో శుక్రవారం ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మర్పడగ ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక, ఆగస్టు 9: రాహుగ్రహ దోషనివారణ కోసం దుర్గా ఆరాధన, కేతు దోషనివారణకు గణపతి అర్చన, కుజగ్రహదోష నివారణకు సుబ్రహ్మణ్యస్వామి అనుష్ఠానం చక్కటి పరిహారాలని దేవీ ఉపాసకులు చెప్పెల హరినాథశర్మ పేర్కొన్నారు. కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతానమల్లికార్జునస్వామి క్షేత్రంలో శుక్రవారం రాహుకాల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్పడగ క్షేత్రంలో లోకక్షేమం కోసం రాహుకాల అర్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై సూచిక బోర్డుల ఏర్పాటు

కొండపాక, ఆగస్టు 9: మండలంలోని దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసులు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు టోల్‌ప్లాజా నిర్వాహకులతో కలిసి సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్, మల్లికార్జున్, ఆరేపల్లి శ్రీను, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నాగమ్మ.. దీవించమ్మా

- ఘనంగా నాగుల పంచమి
- పుట్టలో పాలు పోసి, మొక్కులు తీర్చుకున్న భక్తులు

చిన్నకోడూరు, ఆగస్టు 9: శ్రావణ మాసంలో వచ్చే తొలి పండుగ నాగుల పంచమి. ఈ పర్వదిన వేడుకలను శుక్రవారం చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పలు ఆలయాల వద్ద ఉన్న పుట్టలకు, పసుపు, కుంకుమ, పువ్వులతో పూజలు చేసి నాగమ్మకు దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి, పుట్టల్లో పాలు పోసి తమ కుటుంబాలను చల్లగా ఉండేలా చూడాలని వేడుకున్నారు.


మద్దూరు: ధర్మారంలో పూజలు చేస్తున్న మహిళలు

- **మద్దూరు:** మండలంలో నాగుల పంచమిని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లోన్ని ఆలయాల్లోని నాగుల పుట్ట వద్ద పాలు పోసి మొక్కుకున్నారు. పిల్లాపాపలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ధర్మారం గ్రామంలో అర్ధనారీశ్వర ఆలయంలోని పుట్టలో గ్రామ మహిళలు పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు.
- **రాయపోల్:** రాయపోల్ మండలంలో నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు పిల్లలతో కలిసి పుట్టలు, నాగదేవతాలయాల వద్దకు వెళ్లి పసుపు, కుంకుమలు వేసి పాలు పోశారు. నాగుపాము విగ్రహాలను పుట్టలల్లో వేసి, పేలాలను పుట్ట వద్ద పోసి నాగ దేవతలకు పూజలు చేశారు.
- **దుబ్బాక:** దుబ్బాక మండలంలో నాగుల పంచమిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని గ్రామాలల్లో మహిళలు తెల్లవారుజాము నుంచే నాగదేవత పుట్టలకు పూజలు చేసి, పాలు పోశారు. పుట్టమీద పేలాలు చల్లి, వాటిని తీసుకుని వచ్చారు. దుబ్బాక పట్టణంలోని రేణుకా ఎల్లమ్మఆలయం, దోరస్తంబాల వద్ద నాగదేవతకు పూజలు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడసంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు అంబటి నారాగౌడ్, పల్లె బీజేపీ శ్రీనివాస్‌గౌడ్, అంబటి బాలేష్‌గౌడ్, రామస్వామిగౌడ్, యాదాగౌడ్, జగ్గారి వెంకట్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.
- **మిరుదొడ్డి:** మిరుదొడ్డి మండలంలో నాగుల పంచమిని ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టల వద్దకు వెళ్లి పుట్టకు పూజలు చేశారు. పాలు పోసి, నాగదేవతను మొక్కుకున్నారు.


కొండపాక: మర్పడగలో పూజలు చేస్తున్న మహిళలు

మోతే గ్రామంలో నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- **చేర్యాల:** నాగుల పంచమిని చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు భక్తిశ్రద్ధతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాలతో పాటు రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేకపూజలు జరిపారు. పుట్టవద్దకు వెళ్లి నాగదేవతలకు క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ, నాగులయ్య గుర్జకుంట సంతాన నాగదేవత తదితర ఆలయాలు రద్దీగా మారాయి.
- **కొండపాక:** నాగుల పంచమిని మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. మండలంలోని మర్పడగ, దుద్దెడ, సిరసనగండ్ల, కొండపాక, బందారం తదితర గ్రామాల్లో మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మద్దూరు, ఆగస్టు 9: మండలంలోని కమలాయపల్లికి చెందిన పంజ శ్రీనివాస్ (42) పదిహేను రోజుల క్రితం దుద్దెడ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంలో టిప్పర్ డ్రైవర్‌కు గాయాలు

చేర్యాల, ఆగస్టు 9: చేర్యాల మండలం ఆకునూరు శివారు రుద్రాయపల్లి కాలనీ సమీపంలో విద్యుత్ వైరు టిప్పర్‌కు తగిలి డ్రైవర్ విద్యుత్‌షాక్‌కు గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. కాశీగుడిశెలు సమీపం నుంచి ఆకునూరుకు టిప్పర్‌లో మట్టి తరలిస్తుండగా, రుద్రాయపల్లి శివారులో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగ తగిలింది. దీంతో డ్రైవర్ రాము విద్యుత్ షాక్‌కు గురవడంతో భయాందోళనకు గురయ్యాడు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అనంతరం స్థానికులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు.

భర్తతో గొడవపడి వివాహిత అదృశ్యం


రుక్మిణీ

వర్గల్, ఆగస్టు 9: వర్గల్ మండల కేంద్రానికి చెందిన చెక్కల రుక్మిణీ (32) అనే వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం.. భర్త చెక్కల వెంకటేశ్‌తో గురువారం రాత్రి గొడవపడిన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో కనిపించలేదు. ఎక్కడా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో గౌరారం పోలీసులకు భర్త వెంకటేశ్ ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కరుణకర్‌రెడ్డి తెలిపారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


చేర్యాల: చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న లింగంపల్లి శ్రీనివాస్

చేర్యాల/ములుగు, ఆగస్టు 9: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం చేర్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు చెవిటి లింగం, ముస్త్యాల తార, నాయకులు తడక లింగం, పాల లక్ష్మీనారాయణ, ఐత శ్రీనివాస్, చెట్కూరి కమలాకర్, దాసరి శ్రీకాంత్, నీలం సన్నీ, కర్క సంతోశ్ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ప్రభుత్వ, అంగన్‌వాడీ పాఠశాలల్లో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు లింగంపల్లి కనకరాజు, కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. యువతకు బంగారు భవిష్యత్తు కల్పించే సత్తా సీఎం రేవంత్‌రెడ్డికి ఉందని రాష్ట్ర అధికారి ప్రతినిధి శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. ములుగు మండలం వంటిమామిడిలో అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు, తిగుల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు, పలువురు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

- పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి


పీఆర్టీయూ సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

నంగునూరు, ఆగస్టు 9: పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ముండ్రాయి, వెంకటాపూర్, తిమ్మాయపల్లి, నర్మెట, అంక్షాపూర్, ఖానాపూర్, ఖాత, గట్లమల్యాల, అక్కెనపల్లి, నంగునూరు పాఠశాలలలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించేందుకు అనుమతులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కొత్తపల్లి రవి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షకార్యదర్శులు ఎర్ర పార్థసారథి, పంతం నరేష్, పీఆర్టీయూ నాయకులు భూపతిరెడ్డి, రామస్వామి, రామరాజు, కన్నాలాల్ పాల్గొన్నారు.

ఎస్టీటీల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి


ఆత్మీయ సమావేశంలో ఉపాధ్యాయులు

గజ్వేల్, ఆగస్టు 9: ఎస్టీటీల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం డివిజన్ స్థాయి ఎస్టీటీ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించగా, గజ్వేల్, వర్గల్, జగదేవ్‌పూర్, ములుగు, మార్కుక్, రాయపోలు మండలాలకు చెందిన ఎస్టీటీ ఉపాధ్యాయులు వివిధ సంఘాల సభ్యత్వాలకు రాజీనామా చేసి ఎస్టీటీ యూనియన్‌లో చేరారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేస్తూ విద్యా వలంటీర్లను నియమించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ప్రతి పాఠశాలకు కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండే విధంగా చూడాలని తీర్మానం చేసినట్లు ఎస్టీటీ యూనియన్ అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, వర్గల్ మండల పీఆర్‌టీయూ నాయకులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, రాయపోల్ మండలం యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నరసింహులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బోడవేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్స్ ఏర్పాటుపై ఫిర్యాదు


నరికేసిన చెట్టు కొమ్మలు

మద్దూరు, ఆగస్టు 9: మండలంలోని సలాఖపూర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా హరితహారంలో నాటిన చెట్ల మధ్య విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేస్తుండటంపై పంచాయతీ సెక్రటరీ అశోక్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ అశోక్ మాట్లాడారు. చేర్యాల మండలం ముస్త్యాల శివారులో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పౌల్ట్రీఫామ్‌కు 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే క్రమంలో రోడ్డుకిరువైపులా నాటిన హరిత చెట్లను నరకడమే కాకుండా, చెట్ల మధ్య విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేస్తుండడంతో పౌల్ట్రీఫామ్ నిర్వాహకులను హెచ్చరించినట్లు తెలిపారు. విషయమై పైఅధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఆగస్టు 9: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహనాల తనిఖీలో 13 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 13 మందికి రూ.15,500 జరిమానా విధించారు.